


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 5-4-2025
సంపుటి: 21 సంచిక: 10
పేజీలు: 8 వెల: రూ.1



కోర్కెలు తీర్చమని దేవుణ్ని మొక్కడానికి.. కోర్కెలు తీరిన తర్వాత మొక్కులు చెల్లించడానికి వేలాదిమంది భక్తులు అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధికి వస్తుంటారు. పూజాదికాలు చేసి, ప్రసాద సేవనంతో తమ జన్మ తరించిందని మురిసిపోతుంటారు. కానీ ఇప్పుడా దేవుడే ఒంటరివాడైపోయాడు. తన వద్దకు వచ్చే భక్తులకు కనీసం ప్రసాదం గానీ, సౌకర్యాలు గానీ కల్పించలేని దుస్థితిలో పడిపోయాడు. కారణం.. స్వామి తరఫున వీటన్నింటినీ భక్తులకు సమకూర్చాల్సిన ఆయన పరివారం అస్త్రసన్యాసం చేసింది. ఏడాదికి పైగా తమకు జీతాలివ్వకుండా ఎండబెడుతున్న అధికారుల తీరుకు నిరసనగా సమ్మె బాట పట్టడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరసవల్లి దేవస్థానంలో దాదాపు అన్ని రకాల పనులు, వ్యవహారాలు స్తంభించిపోయాయంటే అతిశయోక్తి కాదు.

# ఏమీ సేతురా... స్వామీ!



- అరసవల్లి దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె
- 14, 15 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడమే కారణం
- భక్తుల అవసరాలు తీర్చలేక నిస్సహాయంగా సూర్యనారాయణుడు
- టికెట్లు, ప్రసాదాల కౌంటర్లు.. అన్నీ ఖాళీ
- ఆదివారం పరిస్థితి ఏమిటన్న ఆందోళన






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అతిపురాతన, ప్రాశస్త్యమైన సూర్యక్షేత్రంగా అరసవల్లి వెలుగొందుతోంది. కానీ పాలకుల నిర్వాకం కారణంగా అనేక సందర్భాల్లో దాని ప్రతిష్ట మసకబారుతోంది. ఇప్పుడు కూడా అదే దుస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరసవల్లిలో ప్రముఖంగా జరిగే రథసప్తమి ఉత్సవాలను రాష్ట్రపండుగగా గుర్తించి ఏటా మూడు రోజుల పాటు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఇటీవల ఘనంగా ఉత్సవాలు జరిపారు కూడా. అంతవరకు బాగానే ఉంది. ఈ ఉత్సవాల ద్వారా అరసవల్లికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని, భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని అర్భాటంగా ప్రచారం చేసుకున్నారు. కానీ వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించే, దేవస్థానంలో దైనందిన కార్యకలాపాలు నిర్వహించే ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న దాదాపు - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# మన యువతలో నైపుణ్యాల కొరత

ప్రపంచంలోనే యువత అత్యధికంగా ఉన్న దేశం మనది. వారిని సక్రమంగా ఉపయోగించుకున్నపుడే దేశాభివృద్ధి సాధ్యం. యువతను శక్తివంతంగా తీర్చిదిద్దే శక్తి విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఉంటుంది. అలాంటి దేవాలయాలు నేడు పాలకుల నిర్లక్ష్యానికి గురై తల్లడిల్లుతున్నాయి. సరైన మార్గ నిర్దేశం చేసే బోధనా సిబ్బంది లేమితో కునారిల్లుతున్నాయి. అంతేకాదు మన ఉన్నత విద్యారంగం పారదర్శకతను సైతం కోల్పోయింది. స్వయంగా పార్లమెంటరీ ప్యానలే తన నివేదికలో చేదు నిజాలను బయటపెట్టింది. దీన్ని బట్టి స్వాతంత్ర్యం అనంతరం దేశంలో మేధావులను తయారు చేసేందుకు ఐఐఎం వంటి సంస్థలను ప్రారంభించారే తప్ప వాటిని కాలానుగుణ మార్పులతో కొనసాగించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదనేది స్పష్టం. ఉన్నత విద్య ప్రాముఖ్యతను గుర్తించి ఏళ్లు గడుస్తున్నా నాణ్యమైన బోధన, నైపుణ్యాల అభివృద్ధి వంటి కీలక అంశాలు చర్చనీయాంశాలుగానే మిగిలిపోతున్నాయి. పాలకుల అరకొర చర్యలతో ఆశించిన ఫలితాలు అందుకోలేకపోతున్నాం. ఇది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. తాజా నివేదికే దీనికి సాక్ష్యం. ఉపాధికి భరోసా ఇచ్చే బోధన మన విద్యాసంస్థల్లో కనిపించడం లేదు. యువతలో నైపుణ్యం పెంపొందించడం కీలకం. అది లేకే వారు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ఆర్థిక వ్యవస్థకు సైతం నష్టం కలుగుతోంది. నాణ్యమైన అధ్యాపకులు మాత్రమే ఈ లోటును భర్తీ చేయగలరు. మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. విద్యారంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాం. ఉన్నత, సాంకేతిక విద్యలో మన దేశాన్ని ప్రపంచం ముందు అగ్రభాగంలో ఉంచుతాం, తద్వారా దేశాభివృద్ధిని పరుగులు తీయిస్తాం' అంటూ గప్పాలు కొడుతూనే ఉన్నారు. తత 'మన్‌కీ బాత్'లోనూ యువశక్తికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని వల్లె వేస్తున్నారు. కానీ ఆచరణలో పరిస్థితి మరోలా ఉంది. ప్రొఫెసర్ల కొరతతో యువత నాణ్యమైన విద్యకు దూరమవుతోందని పార్లమెంటరీ ప్యానల్ నివేదించింది. దేశంలోని ఐఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో 56 శాతానికి పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ నివేదిక తేల్చిచెప్పింది. పరిస్థితి ఇలా ఉంటే నాణ్యమైన యువత ఎలా తయారవుతుందన్నది ప్రశ్న. ప్రపంచ దేశాలతో పోలిస్తే చదువు పూర్తిచేసుకున్న మన యువతలో నైపుణ్యాలు పేలవంగా ఉంటున్నాయని పలు సర్వేలు చెబుతున్నాయి. 2021లో ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో 46 శాతం మందికే ఉద్యోగాలు దక్కాయి. ఇంజనీరింగ్ కాలేజీల నుంచి బయటకు వస్తున్నవారిలో ఉద్యోగ నైపుణ్యాలు కలిగినవారు 25 శాతమే ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనివల్లే మన యువత ఉద్యోగ, ఉపాధి వేటలో వెనుకబడిపోతున్నారు. దేశంలో స్థూలంగా 40 రకాల విభిన్న సామర్థ్య రంగాల్లో ఐదువేల రకాల ఉద్యోగాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. కానీ దేశవ్యాప్తంగా 93 శాతం యువతకు తెలిసినవి ఏడు రంగాలేనని సర్వేలో తేలింది. ఇది విద్యార్థులు, నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. మరో ముఖ్యమైన విషయం ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు కూడా బీజేపీ పాలనలో బాగా తగ్గిపోయాయి. పైగా నేటి మన పాలకులు విశ్వవిద్యాలయాలను మతవిద్వేషాలు రెచ్చగొట్టే కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారే తప్ప, యువత నైపుణ్యాలను పెంచడంపై అస్సలు దృష్టి పెట్టడం లేదు. ఇక మన విద్యా మంత్రిత్వశాఖ అయితే విద్యాసంస్థల్లోకి కాషాయ అజెండాను చొప్పించడంలో తల మునకలైపోతోంది. విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తే హడావుడిగా కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించి 'మమ' అనిపిస్తోంది. ఈ తాత్కాలిక నియామకాల వల్ల విద్యాస్వేచ్ఛకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. మన యువత నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. అంతేకాదు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీతో పాటు ఇతర అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరించి వేసే ప్రమాదం కూడా పొంచి ఉంది. కనుక విద్యారంగంలో శాశ్వత నియామకాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. యువత తమ చదువుకు తగిన నైపుణ్యాలు పొందాలంటే సరైన అధ్యాపకులే కీలకం. తద్వారానే విశ్వవిద్యాలయాలు బలోపేతం అవుతాయి. నైపుణ్యంతో కూడిన విద్యాభ్యాసం చేస్తేనే నాణ్యమైన యువత తయారయ్యే అవకాశం ఉంటుంది. దానికి పాలకులే పూనుకోవాలి.

## ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, రాజకీయవేత్తగా పేరుగాంచిన స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుక పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్ కెవి రమణ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కెవి రమణ మాట్లాడుతూ, బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య భారతదేశ మొదటి కార్మికమంత్రిగా పనిచేసి, దేశంలో వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించి, హరిత విప్లవానికి సహాయ సహకారాలు అందించారన్నారు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించి, ఉప ప్రధానిగా భారతదేశానికి సేవలందించిన గొప్ప వ్యక్తి అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడుగా పేరుగాంచారని కొనియాడారు. కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## మొదలైన ఆదిత్యుని కళ్యాణోత్సవాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణం పురస్కరించుకుని అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు వైభవంగా కళ్యాణాంగ ధ్వజారోహణం పతాకావిష్కరణ, సకల దేవతాహ్వానం, విశేష అర్చన, దిగ్బలి ప్రధానం, హారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం శంకరశర్మ మాట్లాడుతూ నేటి నుంచి స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. కళ్యాణాంగ ధ్వజారోహణం, పతాకావిష్కరణ, సకల దేవతాహ్వానం, విశేషఅర్చన, దిగ్బలి ప్రధానం, హారతిలు నిర్వహించామన్నారు. 7వ తేదీ సోమవారం సాయంత్రం 7-30గంటలకు సుగంధద్రవ్య మర్దన (కోట్నం దంపు) ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 8వ తేదీన రాత్రి 7గంటలకు స్వామివారి వెండి అశ్వవాహనములపై గ్రామ తిరువీధి అనంతరం రాత్రి 8-30 గంటలకు సూర్యనారాయణస్వామి వారికి ఉషా పద్మినీచ్ఛాయా దేవీలతో కళ్యాణ మహోత్సవము, తరువాత అగ్ని ప్రతిష్టాపనము, ప్రవేశ హోమాదులు నిర్వహించనున్నామన్నారు. 9వ తేదీన బుధవారం సాయంత్రం 3-30 నిమిషాల నుంచి "ఆగ్నేయ స్థాలీపాక హెూమాదులు", విశేష భోగములు జరుగుతాయన్నారు. సాయంత్రం 6-30 నిమిషాలకు సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించబడతాయన్నారు. 10న చైత్ర శుద్ధ త్రయోదశి గురువారం ఉదయం 8.30 గంటల నుండి సదస్యం, మహదాశీర్వచనములు, వేదసదస్సు, పండితులకు సత్కారము నిర్వహిస్తామన్నారు. సాయంకాలం 4గంటలకు రథోత్సవము, విశేషపూజ, మంగళహారతి నిర్వహిస్తామన్నారు. 11న చైత్రశుద్ధ చతుర్దశి శుక్రవారం రాత్రి 7గంటలకు సింహవాహనంపై తిరువీధి, స్వామివారి ఉద్యానవనంలో "తిరుమంగయాళ్వారుల చరిత్ర", సంవాదము, విన్నపములు, హారతి, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. 12న ఉదయం 8గంటల నుండి భాస్కరభట్ల నరసయ్యశర్మ, భాస్కరభట్ల శ్రీరామశర్మ, బంకుపల్లె రమేష్ శర్మ, పులఖండం శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సుమంగళి అర్చన, నీలమణిధారణ, నాకబలి ప్రయుక్త చక్రతీర్థం స్వామి వారి ఇంద్రపుష్కరిణిలో జరుగుతుందన్నారు. తిరువీధి అనంతరం ఉత్సవమూర్తుల ఆలయ ప్రవేశం ఉంటుందన్నారు. సాయంత్రం అర్చన అనంతరం ధ్వజావరోహణం, స్వామి వారి పుష్పయాగమహోత్సవమ, విశేష అర్చన జరుగుతుందన్నారు. అనంతరం 'ఏకాంతసేవ' ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు- శ్రీకాకుళం వాస్తవ్యులు సుకుమార్ ఆర్కెస్ట్రా, బి.ఎ. నారాయణ, మండపాక శారద బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని శంకరశర్మతోపాటు ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలిపారు.

## మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) అభ్యర్థులకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్, శ్రీకాకుళం ఉచిత ఆన్లైన్ శిక్షణను అందించనున్నట్లు సంస్థ సంచాలకులు ఇ.అనురాధ తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థుల ఎంపిక టెట్ పరీక్షలలో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతుందని తెలిపారు.


**దరఖాస్తు ప్రక్రియ:**

ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఆదాయం రూ.2 లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని టీడీపీ భవనం వెనుక ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఈనెల 11 లోపు సమర్పించాలని, మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించవచ్చని సంచాలకులు తెలిపారు.

## వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో బాబుజగజీవన్‌రామ్ జయంతి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మిల్లు జంక్షన్ వద్ద విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆనందరావు మాట్లాడుతూ 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా సమర్థవంతమైన పాత్ర పోషించారు. 1977-1979 మధ్య కాలంలో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వంలో ఉప ప్రధానమంత్రిగా, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ కొయ్యాన కిరణ్ కుమార్, భాజపా సీనియర్ నాయకులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు గొద్దు భాస్కరరావు, శ్రీరంగం మధుసూదన్ రావు, ధర్మవరపు ఆచారి, బజరంగ్ దళ్ నగర కన్వీనర్ బొడిగి మధు, కంటిపాక హిమ శేఖరు తదితరులు పాల్గొన్నారు.






# సహనానికి టెస్ట్!

**కథ:** అర్జున్ వెంకట్రామన్ (సిద్దార్థ్) భారత క్రికెట్ జట్టులో పేరుమోసిన బ్యాటర్. జట్టుకు ఎన్నో విజయాలందించి గొప్ప ఆటగాడిగా పేరు తెచ్చుకున్న అతను.. కెరీర్ చరమాంకంలో ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడతాడు. పాకిస్థాన్ జట్టుతో ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్ తో తన కెరీర్ కు ముగింపు పలకాల్సిన స్థితికి చేరుకుంటాడు. మ్యాచ్ మొదలు కాబోతుండగా.. అతణ్ని మ్యాచ్ ఫిక్సింగ్ ఉచ్చులోకి దించాలని బెట్టింగ్ సిండికేట్ ప్రయత్నించి విఫలమవుతుంది. మరోవైపు ఆ సిండికేట్ దగ్గర బాధితుడైన సైంటిస్ట్ శరవణన్ (మాధవన్).. టీచర్ అయిన తన భార్య కుముద (నయనతార) వెంట తమ ఇంటికి వచ్చిన అర్జున్ కొడుకును కిడ్నాప్ చేసి తన సమస్యలన్నీ పరిష్కరించుకోవడానికి ప్రణాళిక రచిస్తాడు. మరి అతడి ప్రయత్నం ఎంతమేర ఫలించింది.. అర్జున్ మ్యాచ్ ఫిక్సింగ్ చేశాడా.. ప్రతిష్టాత్మక మ్యాచ్‌లో తన ప్రదర్శన ఎలా సాగింది.. ఇండియా మ్యాచ్ గెలిచిందా లేదా.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**నటీనటులు:** కెరీర్ ఆరంభంలో లవర్ బాయ్-చాక్లెట్ బాయ్ అనిపించుకున్న మాధవన్.. ఆ తర్వాత రఫ్ క్యారెక్టర్లలోనూ అద్భుతంగా నటించి మెప్పించాడు. 'టెస్ట్'లోనూ ఆయన నటనలో వైవిధ్యం చూడొచ్చు. గ్రే షేడ్స్ ఉన్న పాత్రలో మాధవన్ అదర గొట్టాడు. తన పాత్రలో మార్పు మొదలయ్యాక ప్రతి సీన్లో నూ మెప్పించాడు. చివరి 20 నిమిషాల్లో మాధవన్ నటన మరో స్థాయికి చేరుకుంటుంది. నయనతార పెర్ఫామెన్స్ కూడా సూపరే. కథ సీరియస్ రూట్ తీసుకున్నాక ఆమె ప్రతి సన్నివేశంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంది. కొన్ని సీన్లలో మాధవన్ తో పోటీ పడి నటించింది. ఈ సినిమా చూస్తే మాధ వన్-నయన్ కాంబినేషన్లో సీన్ల కోసమే చూడాలి. సిద్ధు పాత్ర.. తన నటన చాలా వరకు సాధారణంగానే సాగిపోతాయి. ఐతే చివరి అరగంటలో మాత్రం అతను ప్రభావం చూపించాడు. మీరా జాస్మిన్ గురించి చెప్పడానికేమీ లేదు. తెలుగు నటుడు వినయ్ వర్మ.. కాళి వెంకట్.. ఆడుగళం మురుగదాస్.. వీళ్లంతా తమ పాత్రల పరిధిలో బాగానే చేశారు.

**సాంకేతిక వర్గం:** టెక్నికల్ గా 'టెస్ట్' ఓకే అనిపిస్తుంది. విరాజ్ సింగ్ గోహిల్ ఛాయాగ్రహణం బాగుంది. క్రికెట్ మైదానంలో సన్నివేశాలను బాగా తీశాడు. విజువల్స్‌లో క్వాలిటీ కనిపిస్తుంది. శక్తిశ్రీ గోపాలన్ సంగీతం సాధారణంగా అనిపిస్తుంది. పాటలకు ఇందులో పెద్దగా ప్రాధాన్యం లేదు. ఉన్న ఒకటీ అరా పాటలు గుర్తుంచుకునేలా లేవు. నేపథ్య సంగీతం పర్వాలేదు. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. సుమన్ కుమార్-శశికాంత్ కలిసి తీర్చిదిద్దుకున్న స్క్రిప్టులోనే చాలా లోపాలున్నాయి. ఇండియాలో ఒక హై ప్రొఫైల్ క్రికెటర్ కొడుకుని సింపుల్ గా కిడ్నాప్ చేసి తనతో మ్యాచ్ ఫిక్సింగ్ చేయించడం అన్నదే చాలా ఇల్లాజికల్ పాయింట్. నిజంగా ఇలాంటి పాయింట్ అనుకుంటే.. ప్రేక్షకులను కన్విన్స్ చేసేలా.. లాజికల్ గా కరెక్ట్ అనిపించేలా.. లాక్స్ వేసుకోవాల్సింది. కానీ అలాంటి ప్రయత్నమే జరగలేదు. అంతా పైపైన లాగించేయడంతో మంచి మంచి ఆర్టిస్టుల కష్టం వృథా అయిపోయింది.

**కథనం-విశ్లేషణ:**

ఇండియాలో యువతకు అత్యంత ఇష్టమైన రెండు విషయాలు.. సినిమా-క్రికెట్. అందుకే క్రికెట్ నేపథ్యంలో తరచుగా సినిమాలు తెరకెక్కుతుంటాయి. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఈ కథలను తెరకెక్కిస్తే అద్భుత ఫలితం రాబట్టవచ్చని 'లగాన్' లాంటి సినిమాలు రుజువు చేశాయి. ఐతే వేరే కథాంశాల్లో లాజిక్స్ అటు ఇటుగా ఉన్నా పెద్దగా పట్టించుకోరు కానీ.. క్రికెట్ సంబంధిత కథల్లో మాత్రం అన్నీ పక్కాగా ఉండాలి. ఏ చిన్న తప్పు చోటు చేసుకున్నా.. లాజికల్‌గా అనిపించకపోయినా.. ప్రేక్షకులు డిస్కనెక్ట్ అయిపోతారు. 'టెస్ట్' సినిమాలో అదే జరిగింది. 'తమిళ్ పడం'.. 'గురు' సహా పలు చిత్రాలతో నిర్మాతగా అభిరుచిని చాటిన శశికాంత్ దర్శకుడిగా మారుతూ క్రికెట్ నేపథ్యంలో రాసుకున్న కథలో బేసిక్ విషయాలే తేడా కొట్టేశాయి. సినిమాలో మ్యాచ్ ఫిక్సింగ్ నేపథ్యంలో సాగే అత్యంత కీలకమైన సన్నివేశాలే తుస్సుమనిపించడంతో ఈ కథతో ప్రేక్షకులు కనెక్ట్ కావడం కష్టమవుతుంది. కేవలం లీడ్ యాక్టర్ల పెర్ఫామెన్స్ వల్ల 'టెస్ట్' కొంత ఎంగేజ్ చేయగలిగినా.. కథాకథనాల్లో బిగి లేకపోవడం.. లాజిక్స్ మిస్సయిపోవడంతో ప్రేక్షకుల సహనానికి ఇది ఒక 'టెస్ట్'గానే నిలుస్తుంది.

భారత క్రికెట్ జట్టులో మ్యాచ్ ఫిక్సింగ్ ఊసు విని పించి పాతికేళ్లు దాటిపోయింది. ఇక పాకిస్థాన్‌తో మన జట్టు టెస్టు మ్యాచ్ ఆడి కూడా 20 ఏళ్లు కావస్తోంది. అలాంటిది చెన్నైలో ప్రస్తుత కాలంలో ఈ రెండు జట్ల మధ్య టెస్టు మ్యాచ్ జరుగుతుంటే.. జట్టులో నంబర్ వన్ ఆటగాడిగా పేరున్న క్రికెటర్ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లుగా చూపించారిందులో. ఇంటర్నేషనల్ మ్యాచ్ జరుగుతున్న రోజుల్లో ఏ ఆటగాడూ ఇంటికి వెళ్లే అవకాశమే ఉండదు. కానీ ఇందులో మాత్రం క్రికెటరైన హీరో తండ్రి అనారోగ్యం పేరు చెప్పి ఇంటి నుంచే మ్యాచ్‌కు వస్తుంటాడు. వెళ్తుంటాడు. అన్నింటికీ మించి సిల్లీ విషయం ఏంటంటే.. మ్యాచ్ మొదలవుతున్నపుడు.. బ్రేక్ టైంలో సెల్ ఫోన్లో మాట్లాడేస్తుంటాడు.. అది కూడా బెట్టింగ్ మాఫియాతో. అంత పేరుమోసిన క్రికెటర్ కొడుకుని చాలా సింపుల్ గా కిడ్నాప్ చేసేసి తనను బ్లాక్ మెయిల్ చేసి ఫిక్సింగ్ చేయిస్తారు. హీరోతో బెట్టింగ్ మాఫియా మాట్లాడుతున్నట్లు పోలీసులు కనిపెట్టి కూడా ఫిక్సింగ్ గురించి మాత్రం ఏమీ ఆరా తీయరు. హీరో తన పాటికి తాను యథేచ్ఛగా ఫిక్సింగ్ చేసేస్తూ ఉంటాడు. చివర్లో మాత్రం అడ్డం తిరిగి ఇండియాను గెలిపించేస్తాడు. ఇంత సిల్లీగా సీన్లు రాసి.. తీసి.. క్రికెట్ లవర్స్ ను మెప్పించడం ఎలా సాధ్యం?

ఇండియా-పాకిస్థాన్ టెస్టు మ్యాచ్.. అందులో ఫిక్సింగ్.. మరోవైపు కిడ్నాప్.. వీటి చుట్టూ ఉద్వేగభరితంగా.. ఉత్కంఠ రేకెత్తించేలా కథనాన్ని నడిపించాలనుకుంటే ఓ 20 ఏళ్లు వెనక్కి వెళ్లి అప్పటి నేపథ్యంలో కథ రాసుకోవాల్సింది. ఆ కాలానికి అనుగుణంగా సన్నివేశాలను తీర్చిదిద్దుకోవాల్సింది. కానీ సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందిన కాలంలో ఏమాత్రం లాజిక్ లేని విధంగా పైపైన కథాకథనాలను తీర్చిదిద్దుకోవడంతో 'టెస్ట్' నిస్సారంగా తయారైంది. ఓవైపు ఫాంతో తంటాలు పడుతున్న సీనియర్ క్రికెటర్ గా సిద్ధు.. ఇంకోవైపు నీటి నుంచి పెట్రోల్ తయారు చేసే ప్రాజెక్టుతో తనేంటో నిరూపించుకోవాలని చూసే మాధవన్ క్యారెక్టర్.. మరోవైపు ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనాలని ప్రయత్నిస్తున్న నయనతార.. ఇలా మూడు ముఖ్య పాత్రల నేపథ్యం ఆసక్తికరంగానే అనిపిస్తుంది. కానీ ఈ పాత్రల చుట్టూ స్ట్రాంగ్ ఎమోషన్ క్రియేట్ చేయడంలో దర్శకుడు విఫలమయ్యాడు. దీనికి తోడు ముందే చెప్పుకున్నట్లు లాజిక్ లేని సీన్లు సినిమాను ఏ దశలోనూ సీరియస్ గా తీసుకోలేని పరిస్థితి కల్పించాయి. కిడ్నాప్ వ్యవహారం.. ఫిక్సింగ్ సీన్లు అయితే పూర్తిగా తేలిపోయాయి. మాధవన్-నయనతార బాగా పెర్ఫామ్ చేయడం వల్ల ఇద్దరి మధ్య వచ్చే కొన్ని ఎమోషనల్ సీన్లు ఆకట్టుకుంటాయి. సిద్ధు చివర్లో కొంచెం ఇంపాక్ట్ వేయగలిగాడు. అంతకుమించి సినిమాలో ఇంప్రెస్ చేసే విషయాలేమీ లేవు. క్రికెట్ మీద సినిమా తీస్తూ ఆటకు సంబంధించిన ముఖ్యమైన విషయాల మీద కూడా అవగాహన లేనట్లు సన్నివేశాలు తీస్తే వాటిని ఎంజాయ్ చేయడం కష్టం. రెండు గంటలకు కాస్త ఎక్కువ నిడివే ఉన్నప్పటికీ.. ఓ పెద్ద సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుందంటే.. అందుకు నత్తనడకన సాగే సన్నివేశాలే కారణం. నేరుగా ఓటీటీలో రిలీజైంది కాబట్టి ఫాస్ట్ ఫార్వర్డ్ లో చూసుకునే ఆప్షన్ ఉండడం ఒక్కటే ఇందులో పాజిటివ్ విషయం.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# జగజ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని, సమతా వాది డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు అరసవిల్లి మిల్లు జంక్షన్ కూడలిలో శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముందుగా అరసవిల్లిమిల్లు జంక్షన్ కూడలిలో కాస్యవిగ్రహాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళంలో అభివృద్ధి జగ్జీవన్‌రామ్ జయంతి రోజు నుండి మరింత వేగవంతం అవుతుందన్నారు. దేశానికి ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలు, అప్పటి చట్టాలు, వివక్ష లేని సమసమాజం ఏర్పాటు చేసిన మహనీయులు బాబుజగ్జీవన్ రామ్ అన్నారు, రక్షణశాఖకు మంత్రిగా కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. దేశం కోసం, సమాజం కోసం ఏమైనా చేయడానికి తనకి విద్య అవసరం అని గుర్తించిన మహనీయులన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనలో అందరూ ముందుకు సాగి పిల్లలకి మంచి విద్యను అందించాలన్నారు. చంద్రబాబు నాయుడు బీసీలకు గుండెల్లో పెట్టుకొని పరిపాలించే నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. స్వేచ్ఛ, స్వతంత్రంతో పరిపాలన అందించాలనే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఒక దళితులకే నాయకులు కాదు మనందరికీ నాయకులన్నారు. ప్రధాన కేంద్రంలో మంచి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయంతో పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు సేవలందించే దిశగా అడుగులు వేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళంలో పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ కాంస్యవిగ్రహం ఆవిష్కరించడం చాలా సంతోషం కలిగిస్తుందన్నారు. ఏప్రిల్ నెలలో ముగ్గురు ప్రముఖ నాయకులు పుట్టడం మనందరికీ మంచి అదృష్టమన్నారు. 11వ తేదీన బీసీ భవనం ప్రారంభం కానుందన్నారు. ఆదర్శాలను అవగాహన చేసుకొని ముందుకు సాగాలని, ఈ కార్యక్రమం ఒక పండగ వాతావరణంలో జరుపుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమన్నారు. ప్రతీ ఒక్కరికి స్వాతంత్ర ఫలాలు అందే దిశగా కూటమి ప్రభుత్వంలో తామంతా కృషి చేస్తున్నామన్నారు. దామషా (జనాభా ప్రాతిపదికన) పదవులు కేటాయించేలా కృషి చేస్తామన్నారు. అలాగే అమరావతిలో 11ఎకరాల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ స్మృతివనం నిర్మిస్తామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఈరోజు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈరోజు కాంస్య విగ్రహన్ని ఆవిష్కరించుకోవడం మంచి పరిణామమన్నారు. అలాగే ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సమతావాది డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు, కాంస్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు.

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ బాబూ జగజ్జీవన్‌రామ్ 30 సంవత్సరాలు కేబినెట్ మంత్రిగా పని చేశారన్నారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం మంత్రుల సూచనల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సూడా ద్వారా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలాగే సూడా ఆధ్వర్యంలో నగరాన్ని సుందరికరణ చేసే కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు బోసు మన్మథ రావు, ఎన్.చిన్నరావు, రాంగోపాల్, రమణ మాదిగ, ఖంట వేణు, గోర సురేష్, బోనెల అప్పారావులు మాట్లాడుతూ బీసీలకు అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అర్హులకు అందేవిధంగా కార్యరూపం దాల్చడానికి ప్రధాన కారణం ఎందరో మహానుభావులన్నారు. బీసీలకు రాయతీలు అందించేందుకు అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అటువంటి మహనీయుని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. బహుజన మహనీయులు ఏప్రిల్ నెలలో జన్మించారన్నారు. భారత దేశానికి డా. బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ డివివిఎస్ ప్రసాదరావు, శ్రీకాకుళం తహశీల్దార్ గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ పైడిశెట్టి జయంతి, అరవల రవీంద్ర, దళిత నాయుకులు తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ధర్మాన టీవీఎస్ షోరూం సీజ్‌పై హైకోర్టు ఆగ్రహం

## - వెంటనే తాళాలు తెరవాలంటూ ఆదేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని వన్‌వే ట్రాఫిక్ రోడ్డులో ఉన్న ధర్మాన టీవీఎస్ షోరూంనకు మున్సిపల్ అధికారులు ఈనెల 1వ తేదీన బలవంతంగా తాళాలు వేసి, సీజ్ చేసి ఏకపక్షంగా వ్యవహరించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మున్సిపల్ అధికారుల చర్యను నిలిపివేస్తూ, వెంటనే షోరూంను తెరవాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సరైన పద్ధతిలో లైసెన్స్ కోసం ధర్మాన టీవీఎస్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మున్సిపల్ యంత్రాంగం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు నాలుగు వారాల పాటు స్టే విధించింది. ట్రేడ్ లైసెన్స్ లేదనే కారణంతో ఏప్రిల్ 1న మున్సిపల్ అధికారులు ధర్మాన టీవీఎస్ షోరూంకు తాళం వేశారు. అయితే, పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపిన వివరాల ప్రకారం, "లైసెన్స్ దరఖాస్తు, ఫీజు చెల్లింపులు పూర్తయ్యాయి. కేవలం ఫార్మ్-17 సంతకంలో ఉన్న సాంకేతిక లోపం కారణంగా షోరూంను మూసివేయడం అన్యాయమ"ని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ న్యాయపతి విజయ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని చట్టాన్ని పాటించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అధికారులు తొందరపాటుతో షోరూం మూసివేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ట్రేడ్ లైసెన్స్ ఏ విభాగంలో అవసరమో స్పష్టత లేకుండానే చర్యలు తీసుకోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన తాళాల వేసిన ఉత్తర్వులను నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, వెంటనే షోరూం తాళాలు తీసి వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణ కోసం మూడు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. హైకోర్టు తీర్పుతో ధర్మాన టీవీఎస్ షోరూం త్వరలోనే తిరిగి కార్యకలాపాలు ప్రారంభించనుంది. వ్యాపార కార్యకలాపాలకు అడ్డుతగిలేలా కక్ష సాధింపు చర్యలు ఉండకూడదనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ క్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, హెల్త్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్, శాసనసభ్యుడు గొండు శంకర్, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, తదితరులపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందని, వారి పాత్రపై స్పష్టత రావాల్సి ఉందని మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శికి, అర్బన్ డెవలప్మెంట్ అధికారి, స్టాండింగ్ కౌన్సిల్, ప్రభుత్వ న్యాయవాదులు, తదితరులందరికీ కూడా ధర్మాన ధర్మారావు తరపున న్యాయవాది నోటీసులు పంపారు.

# వంశధార ప్రాజెక్ట్ తక్షణమే పూర్తి చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వంశధార ప్రాజెక్టు పూర్తి చేయకుండా శ్రీకాకుళం జిల్లా ఎలా అభివృద్ధి చెందుతుందని వామపక్ష నాయకులు, ప్రజా సంఘాలు సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. స్థానిక సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో వంశధార ప్రాజెక్టు పూర్తి చేసి చివర భూముల వరకు రెండు పంటలకు నీరు ఇవ్వాలని, వంశధార ఆధునికరణకు రూ.1500కోట్లు కేటాయించాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల్లో బీజేపీ, టీడీపీ కూటమి అధికారంలో ఉన్నదని వంశధార వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిషన్ మనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దానిని కేంద్రం గజిట్ నోటిఫికేషన్ వేయించి నేరడి వద్ద బ్యారేజ్ ఎందుకు నిర్మించడం లేదని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును వారు ప్రశ్నించారు. నేరడి బ్యారేజీ నిర్మించకపోతే రిజర్వాయర్‌కు నీరురాక ఒక పెద్ద చెరువుగా మిగిలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వంశ ధార రిజర్వాయర్ ద్వారా చివర భూముల వరకు రెండు పంటలకు నీరు ఇస్తే జిల్లాకు సంవత్సరానికి రూ.2వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరిగి అనుబంధ పరిశ్రమలు వస్తాయని, వలసలు నివారించబడతాయని గోదావరి కృష్ణాజిల్లాలతో సమానంగా మన జిల్లా అభివృద్ధి అవుతుందని వారు అన్నారు. వంశధార రిజర్వాయర్ పూర్తి చేయకుండా అభివృద్ధి కోసం చెప్పడం అంటే అది బూటకమేనన్నారు. సముద్ర తీరప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం ద్వారా అభివృద్ధి జరగదని,నదీ జలాలను వినియోగించడం ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందన్నారు. వంశధార నదిలో సుమారు లక్ష క్యూసెక్కు నీరు ప్రవహిస్తుందని దానిలో మన వాటా 50 శాతం వంశధార ఎడమ కాలు ద్వారా 2400 క్యూసి క్కులు, కుడి కాలు ద్వారా 800 క్యూసెక్కులు నీరు మాత్రమే ఉపయోగించడం జరుగుతుందన్నారు. సమావేశంలో వెలమలరమణ, పొందూరు చంద్రరావు, సిటూ నాయకులు అల్లుసత్యం, అల్లు సూర్యనారాయణ, యన్.గోవ ర్ధనరావు, సంతోష్, శ్రీను, కొత్తకోట అప్పారావు, పి.పవిత్ర, డి.చందు, బి.హరీష్, బాగతి వాసుదేవరావు ,రామారావు హరి, ఖగేష్, శిరీష, రాహుల్, గోవర్ధన్‌లు ప్రసంగించారు

## మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ సిక్కోలు సత్తా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భీమవరంలో జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో శ్రీకాకుళం జిల్లా కవిటికి చెందిన దుదిస్టీ మజ్జి 55కేజీల విభాగంలో ప్రథమ స్థానం పొందారు. వైకుంఠరావు( శ్రీ కూర్మం) 60 కేజీల విభాగంలో 4వ స్థానం, కె.అవినాష్ (పలాస) ఎమ్మెల్యే, జనసేనపార్టీ అభ్యర్థి అంజిబాబు, శ్రీకాకుళం సీనియర్ బాడీబిల్డర్ వి.విజయకుమార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కె.గౌరీశంకర్, అధ్యక్షులు తారకేశ్వరరావు చీఫ్ వెటరన్ డాక్టర్ బాడాన దేవభూషణ్, బలగ ప్రసాద్‌లు అభినందించారు.



ఎత్తురాళ్లపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ తలగాన గణపతి మాస్టర్‌ని నియోజవర్గ వైకాపా ఇన్ఛార్జ్ పేరాడ తిలక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు సంపతరావు హేమసుందరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, బీసీ సెల్ అధ్యక్షులు పేరాడ వెంకటరావు, మండల వైకాపా యువజన అధ్యక్షులు మెండ జగన్, సీనియర్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, టెక్కలి

## బీజేపీ విస్తృతస్థాయి సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈనెల 6న జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురించి, 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాలు గురించి, రాబోయే కార్యక్రమాలు గురించి, మండలాల బూత్ కమిటీలపై ఈ సమావేశంలో చర్చించారు. కార్యక్రమానికి బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, ఏలూరు జిల్లా ఇంచార్జ్ నరేంద్ర ప్రకాష్, జిల్లా ఇంచార్జ్ నీలాపు విజయానంద్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర సెల్స్&డిపార్ట్మెంట్ కో-కన్వీనర్ పైడి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దుర్గారావు గాంధీ, పాలవలస వైకుంఠరావు, సలాన రాఘవరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, నేషనల్ కౌన్సిల్ మెంబెర్ చల్లా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లాలో బీజేపీ అన్ని మండలాల అధ్యక్షులు,బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రావమ్ జయంతి సందర్భంగా జిల్లా వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని జగజ్జీవన్‌రావమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక జ్యోతిరావు పూలె పార్క్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బుడుమూరు రాజేష్ పాల్గొని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులుగా, ఉప ప్రధానమంత్రిగా సుదీర్ఘ సమయం అనేక కేంద్ర మంత్రి శాఖలు చేసి దళిత, బీసీ కోసం ఉద్యమ నాయకులుగా ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అమీరుల్లా బేగ్, ప్రధాన కార్యదర్శి గద్దిబోయిన కృష్ణారావు, రౌతు శంకరరావు, నాగరాజు, కాయిత వెంకటరమణ, కిల్లాన శ్రీనివాస్, గుత్తి చిన్నారావు, ప్రసాద్, కన్నాబాబు, సీరా సత్యనారాయణ, వి.మంగయ్య తదితరులు బీసీ నాయకులు పాల్గొన్నారు

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# విద్యార్థుల భవితవ్యాన్ని నిర్దేశించేది ఇంటర్ మాత్రమే

విద్యార్థుల భవితవ్యాన్ని నిర్దేశించేది ఇంటర్ విద్యని పేడాడ విద్య సంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఇంటర్ విద్యలో ఈ ఏడాది నుండి అమలవుతున్న సంస్కరణలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు చాలా అవగాహన అవసరమని ఆయన స్పష్టం చేశారు. శ్రీవిద్య జూనియర్ కళాశాల ఆవరణలో "ఇంటర్ విద్య-నూతన సంస్కరణలు" పై టెక్కలి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, నందిగామ మండలాల విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజనీరింగ్, మెడికల్ వంటి ఉన్నత విద్యతోపాటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఎన్.డి.ఏ, వివిధ పోటీ పరీక్షలకు కూడా ఒత్తిడి లేని విధంగా విద్యార్థులు ఇంటర్ విద్యతో ఏకకాలంలో సిద్ధం కావాలని పరమేశ్వరరావు అన్నారు. ప్రణాళిక బద్ధమైన, అవగాహన గల యాజమాన్యాలు మాత్రమే వీటిని అందించగలవన్నారు. శ్రీవిద్య జూనియర్ కళాశాలలో ఆధునిక వసతులు ఏర్పాటు చేశామని, ఇంటర్ విద్యతోపాటుగా ఈ ఏడాది నుండి నీట్, ఎంసెట్, పోటీ పరీక్షలకు శిక్షణ ఏకకాలంలో కొనసాగిస్తామని శ్రీవిద్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి.చంద్రశేఖర్ ఆజాద్ వివరించారు. తమ కళాశాలలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన విహార యాత్రలకు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. కెరీర్‌తో పాటు విద్యార్థుల వ్యక్తిగత వికాసం తమకు ముఖ్యంగా భావిస్తామని ఆజాద్ పేర్కొన్నారు. శ్రీవిద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్ పాత్రని రామారావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో పి.బి.దేవి బీ.ఈడీ కళాశాల, ప్రణవి డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు వానపల్లి భాగస్వామి, కొండల రుక్మంగధరరావు, శ్రీవిద్య జూనియర్ కళాశాల అధ్యాపకులు నత్తు కృష్ణారావు, జి.కుమారి, ఉంగటి సుజాత, డొక్కరి ప్రభాకరరావు, ఎన్. రాజారాం, కె.వి.ప్రసాద రావు, ఎల్.రోహిణి కుమారి, సి.హెచ్. నాగమణి, పి.ప్రవీణ, ఎం.మంజుల, ఎం.అప్పన్న, పి.వి. సుగుణ సరోజిని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



















# ఏమీ సేతురా.. స్వామీ!

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది అందరికీ 14, 15 నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. ఇంతకాలం ఓపికగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులు ఇక తమవల్ల కాదని, తమ కుటుంబాలను పస్తులు పెట్టి పనులు చేయలేమంటూ సమ్మె అస్త్రం ప్రయోగించారు. శనివారం నుంచి విధులు బహిష్కరించడంతో దేవస్థానంలో దాదాపు కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి.

### నలుగురే మిగిలారు

దేవస్థానంలో పని చేస్తున్న వారిలో 95 శాతానికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) సహా నలుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. అర్చకులు ఉన్నా వారు పూజలు, ఇతర విధులు నిర్వర్తించరు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మొత్తం 48 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం నుంచి సమ్మెలోకి వెళ్లడంతో దేవస్థానంలో కార్యకలాపాలు స్తంభించాయి. వారంతా దేవస్థానం ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు నెలల తరబడి జీతాలు లేక తమ కుటుంబాలు దుర్భర స్థితిని ఎదుర్కొంటున్నాయని వారు ఆరోపించారు. తక్కువ జీతాలతో తమతో ఎక్కువ పనులు చేయించుకుంటున్న అధికారులు, జీతాల గురించి అడిగితే విధుల నుంచి తొలగిస్తామని బెదిరించేవారని, దాంతో తమ దుస్థితిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారాలు, రథసప్తమి వంటి పర్వదినాల్లో తమతో రెట్టింపు చాకిరీ చేయించుకునే అధికారులు జీతాల విషయంలో మాత్రం ఉలుకూపలుకూ లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, విధులకు హాజరుకావాలని ఆలయ అధికారులు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఉద్యోగులు ససేమిరా అన్నారు.

### టికెట్లు కొట్టేవారు లేరు.. ప్రసాదం పెట్టేవారూ లేరు

మెజారిటీ సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో అరసవల్లి దేవస్థానం బోసిపోయింది. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి సేవలూ అందకుండా పోయాయి. దర్శనం టికెట్లు కొట్టేవారు లేక ఆ కౌంటర్ ఖాళీగా కనిపించింది. తలనీలాల సమర్పణకు టికెట్లు కొట్టే కౌంటర్, ప్రసాదాలు అమ్మే కౌంటర్ల వద్దా అదే పరిస్థితి కనిపించింది. అసలు ప్రసాదాలు తయారుచేసేవారే లేకుండాపోయారు. ఆలయంలో సాధారణ రోజుల్లో సుమారు 500 పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తారు. ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఈ విక్రయాలు కొన్ని రెట్లు అధికంగా ఉంటాయి. లడ్డూ ప్రసాదం పరిస్థితి కూడా ఇంతే. అయితే పులిహోర ప్రసాదం వండేవారు లేకపోయారు. అయితే దేవస్థానంలో లడ్డూల స్టాక్ కొంతవరకు ఉంది. వాటిని ఎలాగోలా విక్రయించే ప్రయత్నం చేసినా, ఒకటి రెండు రోజులకే ఆ స్టాక్ కూడా నిండుకుంటుంది. ఇక ఆలయంలో పారిశుధ్యం, ఇతర కార్యక్రమాల నిర్వహణ నిలిచిపోయాయి. దీనివల్ల ఆలయంలో పారిశుధ్యం దెబ్బతింటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### హమ్మయ్యా.. స్వామి భోగానికి లోటు లేదు

సిబ్బంది సమ్మె వల్ల తలెత్తిన ఇబ్బందికర పరిస్థితుల్లో స్వామివారికి నిత్యభోగ కైంకర్యాలు ఎలా? అన్న ఆందోళన స్థానికులు, భక్తుల్లో కనిపించింది. అయితే ఆ విషయంలో మాత్రం ఇబ్బంది లేదని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్నాళ్ల క్రితమే స్వామివారికి భోగంగా సమర్పించే ప్రసాదాల తయారీకి వెంకన్నబాబు అనే వ్యక్తిని కన్సాలిడేటెడ్ వేతనంపై దేవస్థానం నియమించింది. సమ్మెతో సంబంధం లేని ఆయన స్వామి కైంకర్యానికి ప్రసాదాలు తయారు చేస్తుండటంతో భోగానికి నోచుకోక సూర్యనారాయణ స్వామివారు పస్తులుండే ప్రమాదం తప్పింది. అయితే రేపు ఆదివారం రోజూ కంటే ఎన్నో రెట్లు అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివస్తారు. సిబ్బంది సమ్మెలో ఉండటంతో టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ఇతరత్రా ఏర్పాట్లు ఎలా చేస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## బగ్గు సరోజినీదేవి ఆసుపత్రికి
# ఎన్ఏబీహెచ్ గుర్తింపు



- జాతీయ ప్రమాణాలతో వైద్యసేవలపై కితాబు
- సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో అత్యుత్తమ సేవలు
- మెరుగైన, నాణ్యమైన సేవలకు అవకాశం
- రెండు దశాబ్దాల కల సాకారమైంది
- ఆసుపత్రి ఎండీ డాక్టర్ బగ్గు శ్రీనివాస్

సత్యంన్యూస్, శ్రీకాకుళం

బగ్గు సరోజినీ దేవి ఆసుపత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు దక్కిందని ఆసుపత్రి ఎండీ డాక్టర్ బగ్గు శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) కింద నమోదైన స్వయం ప్రతిపత్తి సంస్థ ఎన్ఏబీహెచ్ ద్వారా గుర్తింపు లభించిందన్నారు. ఆసుపత్రులు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరిధిలో నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి ఉన్నాయా..? లేదా? అని నిర్ధారించి, ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగు పరచటం ఎన్ఏబీహెచ్ లక్ష్యమన్నారు. ఎన్ఏబీహెచ్ అనేది ఆసుపత్రులు, వైద్యకేంద్రాలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలతో సహా వివిధ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు అక్రిడిటేషన్ ప్రొగ్రామ్స్ నిర్వహిస్తుందన్నారు. ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ గుర్తింపు రావడంతో రెండు దశాబ్దాల కల నెరవేరిందన్నారు. వాస్తవానికి 2017లోనే ఎన్ఏబీహెచ్ ఎంట్రీలెవల్‌కు అర్హత సాధించిన ఏకైన ఆసుపత్రి బగ్గు సరోజిని దేవి అని తెలిపారు. కుటుంబం ప్రజాసేవకే అంకితమైందని, తండ్రి, నానమ్మ ఎమ్మెల్యేలుగా పని చేశారని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే ఆసుపత్రి పెట్టి పేద ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. మొత్తం 357కు పైగా అంశాలు పరిశీలించి, వాటి నాణ్యత పరిశీలన అనంతరం గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ గుర్తింపు శ్రీకాకుళం వాసులకు జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన వైద్యం అందుతుందని గర్వంగా చెప్పగలుగుతున్నామన్నారు. జిల్లా వైద్య రంగంలో ఇది ఒక అద్భుతమన్నారు. సిక్కోలు వైద్యానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో తొమ్మిది సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో పాటు, 12 డయాగ్నోస్టిక్స్ సేవలకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించిందన్నారు. జిల్లా చరిత్రలో తొలిసారిగా గుర్తింపు పొందిన ఏకైక ఆసుపత్రిగా బగ్గు సరోజినీదేవి నిలిచిందన్నారు. ఈ గుర్తింపుతో జిల్లాలో వైద్యరంగం మరింత పురోగమిస్తుందన్నారు. బగ్గు సరోజినీదేవీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు నిరుపేదలు, సామాన్యులకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో జనరల్ సర్జరీ, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, ఎనస్థీషియా, జనరల్ మెడసిన్, గైనకాలజీ అండ్ ఓబీజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ విభాగాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. డయాగ్నోస్టిక్స్ విభాగంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే, ఈసీజీ, ఈఈజీ అండ్ ఈఎన్ఎంజీ, ఈకో, క్లినికల్ బయోకెమిస్ట్రీ, క్లినికల్ పాథాలజీ, హెమటాలజీ, ఫిజియోథెరపీ, రీహేబిలిటేషన్ విభాగాలకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించిందని వివరించారు.

## శ్రీ పాండురంగ విఠలునికి అష్టోత్తర పుస్తకార్చన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మచిలీపట్నంలోని చిలకలపూడిలో కీరపండరిగా ప్రసిద్ధి చెందిన శ్రీ రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వర రావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా కృష్ణం వందే జగద్గురుమ్ అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సు కోసం స్వయంభువుగా వెలసియున్న స్వామివారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ నిర్వాహకులు, అర్చకుడైన టేకి నరసింహంకు అందజేశారు. ఈ పుస్తకంలో శ్రీకృష్ణుని జీవితంతో ముడిపడివున్న పురాణ ప్రసిద్ధ, విచిత్ర, విభిన్న నామాలతో గల స్వామికి చెందిన 108 ఆలయాల విశేషాలను, శ్రీకృష్ణుని చరిత్ర, స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.దుర్గాపావని, ఆర్.ప్రియాంక, సీహెచ్ సీతారాం, సీహెచ్ ఏడుకొండలు, వై.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక శ్రీవైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజాలో ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు బొడ్డేపల్లి మీనాక్షి నిర్వహించిన ఉచిత ప్రసూతి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం జరిగిన ఈ శిబిరంలో సుమారు వందమంది ఉచితంగా వైద్యసేవలు పొందారు. హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. రోగులకు అవసరమైన వైద్య సలహాలను అందించి, పలు సూచనలు చేశారు. వైద్య శిబిరంలో ప్లాజా యాజమాన్య ప్రతినిధులు చిట్టిబాబు, మురళీ, అనిల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.












## రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో శక్తి అవేర్నెస్ ప్రోగ్రాం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధి యూనివర్సిటీలో శక్తి అవేర్నెస్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ త్రినేత్రీ విద్యార్థులతో మాట్లాడుతూ జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అత్యవసరం అనుకుంటే శక్తి యాప్‌ని ఉపయోగించాలని అన్నారు. కార్యక్రమంలో డైరక్టర్ బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీన్ శివరామకృష్ణ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.






## అంతకాపల్లి శ్రీవేంకటేశ్వర ఆలయంలో
# 8 నుంచి బ్రహ్మోత్సవాలు

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం-చిలకపాలెం రోడ్డులో రాజాం పట్టణానికి సమీపంలోని అంతకాపల్లిలో వెలసిన శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 14 వరకు అత్యంత వైభవంగా జరుపనున్నట్లు టీటీడీ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న దీక్షాభిషేకం, అంకురార్పణ, 9న ధ్వజారోహణం, 10న పల్లకి సేవ, తిరుమంజనం, డోలోత్సవం, 11న కళ్యాణోత్సవం, 12న పల్లకి ఉత్సవం, డోలోత్సవం, 13న మిథున లగ్నమందు చక్రస్నానం, అన్న సమారాధన, పుష్పయాగం, ద్వాదశారాధన, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, సప్తావరణసేవ, 14న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు ఆ ప్రకటనలో కోరారు.

## కంటి చికిత్సలకు
# ఇక హైదరాబాద్ వెళ్లక్కర్లేదు

- మంచు కంటి ఆసుపత్రి సాంకేతికతపై కేంద్రమంత్రి హర్షం -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఇకనుంచి కంటి వ్యాధులకు సంబంధించి ఎటువంటి చికిత్సలకైనా హైదరాబాద్ వరకు వెళ్లనవసరం లేదని, శ్రీకాకుళం నగరంలో నూతన భవనంలోకి వచ్చిన మంచు ఐకేర్ సెంటర్‌ను చూసిన తర్వాత తనకు ఆ నమ్మకం వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈమేరకు శనివారం బలగమెట్టు వద్ద సొంత భవనంలోకి వెళ్లిన మంచు ఐకేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్తాల్మిక్ రంగం హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి చెందిందని, కంటికి సంబంధించి అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని, కేవలం చూపునకు మాత్రమే సంబంధం లేని వ్యాధులు వెలుగుచూస్తుండటం వల్ల అనేకమంది పక్క రాష్ట్రానికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారన్నారు. ఇప్పుడు మంచు ఐకేర్ సెంటర్‌లో ఉన్న ఎక్విప్‌మెంట్, వసతులు చూసిన తర్వాత ఎటువంటి కంటి సమస్యలకైనా చికిత్స అందించగలరనే నమ్మకం కలిగిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళాన్ని అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే వైద్య రంగంలో వస్తున్న అనేక టెక్నాలజీలను ఇక్కడి వైద్యులు అందిపుచ్చుకోడానికి ముందుకొస్తున్నారని, మంచు ఆసుపత్రి చీఫ్ వాసుదేవరావు మాదిరిగానే నగరంలో అనేకమంది వైద్యప్రముఖులు ముందుకొస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆప్తాల్మిక్ వైద్యులు డాక్టర్ జగన్మోహన్‌రావు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సనపల నర్సింహమూర్తి, డాక్టర్ గొండు గంగాధర్, నగరంలోని ప్రముఖ వైద్యులు హాజరయ్యారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.